క్లుప్తంగా

స్పందన అర్జీలను తక్షణం పరిష్కరించండి



మాట్లాడుతున్న తహసీల్దార్ పరమేశ్వరస్వామి

పుత్తూరు రూరల్: స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలను తక్షణం పరిష్కరించాలని వీఆర్ఓలను తహసీల్దార్ జె.పరమేశ్వరస్వామి ఆదేశించారు. సోమవారం వీఆర్ఓల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ రిజిస్టర్ అగ్రికల్చరల్ భూములకు సంబంధించిన అర్జీలపై ఫీల్డ్ లెవెల్‌లో విచారించి సాదా బైనామాలో క్లెయిమ్‌లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే రీసర్వేకు సంబంధించిన రికార్డులను సిద్ధం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఆర్ఎస్‌డీటీ స్వరూపరాణి, సర్వేయర్ శేషమరాజు, వీఆర్ఓలు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

నగరి: మండలంలోని బుగ్గఅగ్రహారంలో టీటీడీ అనుబంధంగా ఉన్న అన్నపూర్ణాసమేత కాశీవిశ్వేశ్వర ఆలయంలో సోమవారం దాతలు భక్తులకు అన్నదానం చేశారు. ఆలయానికి దర్శనానికి విచ్చేసిన భక్తులకు జయరామయ్య అనే దాత ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అన్నదానం చేశారు. ఆలయంలో అన్నదానం చేయదలచిన వారు ముందురోజు పేరు నమోదు చేసుకోవాలని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గుణశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

9న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న జడ్జి గోపాలకృష్ణ

పుత్తూరు రూరల్: పుత్తూరు సబ్ కోర్టు ఆవరణలో సెప్టెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు స్థానిక అదనపు జూనియర్ సివిల్‌జడ్జి వి.గోపాలకృష్ణ తెలిపారు. సోమవారం కోర్టు ఆవరణలో పోలీసులతో సమావేశం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ రాజీకి లోబడిన అన్ని క్రిమినల్ కేసుల పరిష్కారానికి పోలీసులు కృషి చేయాలని సూచించారు. రాజీమార్గమే రాజమార్గమని, లోక్ అదాలత్ తీర్పుపై అప్పీల్ ఉండదని కక్షిదారులకు తెలియజేయాలన్నారు. అన్ని రకాల సివిల్ కేసులను రాజీ చేసుకోవచ్చని తెలిపారు. కోర్టులో పెండింగ్‌లో లేని ప్రీ లిటిగేషన్ కేసులను రాజీ చేసుకోవచ్చన్నారు. జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెట్రోల్ బంకుల్లో తనిఖీలు

నగరి: రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్ బంకుల్లో తనిఖీలు చేస్తున్నట్లు తిరుపతి జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.ఈశ్వర రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ డీజీ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల ప్రకారం లీగల్ మెట్రాలజీ అధికారుల బృందం తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని నాలుగు పెట్రోల్ బంకుల్లో తనిఖీలు చేశారు. అందులో భద్రతా ప్రమాణాలు, నాణ్యమైన, కచ్చితమైన తూకంతో పెట్రోల్, డీజిల్‌ను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు, విక్రయిస్తున్నారా ? లేదా అని పరిశీలించారు. అందులో నగరి, పచ్చికాపలంలోని రెండు పెట్రోల్ బంకుల్లో తక్కువ కొలతలతో విక్రయిస్తున్నట్లు గుర్తించి స్టాప్ సేల్ ఆర్డర్స్ ఇచ్చినట్లు కె.ఈశ్వర రెడ్డి మాట్లాడుతూ తరచూ ఇటువంటి తనిఖీలు చేపట్టడం జరుగుతుందన్నారు. అందుకు సంబంధించిన నివేదికలను ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు.

ఈ-క్రాప్ బుకింగ్ పరిశీలన



మాట్లాడుతున్న ఏఈ ఢిల్లీప్రసాద్

పాలసముద్రం: మండల పరిధిలోని రైతులు ఖరీఫ్ సీజన్ పంటలు ఈ-క్రాప్ బుకింగ్ ద్వారా నమోదు చేయించుకుంటేనే రైతులు అన్నిరకాల ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారని ఏఓ ఢిల్లీ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం పాలసముద్రం రైతు భరోసా కేంద్రంలో ఈ-క్రాప్ బుకింగ్ నమోదుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఓ ఢిల్లీప్రసాద్ మాట్లాడుతూ రైతులు పంటలు నమోదు చేసుకుంటేనే క్రాప్ ఇన్సూరెన్సు రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా, పంటనష్ట పరిహారం తదితర పథకాలు వర్తిస్తాయన్నారు. రైతు భరోసా సిబ్బంది మధుసూదన్, భాస్కర్ నాయక్, నవనీత రైతులు పాల్గొన్నారు.

శరవేగంగా డ్రైనేజీ నిర్మాణాలు

పుత్తూరు రూరల్: పట్టణంలో సీసీ డ్రైనేజీ నిర్మాణాలు జోరుగా జరుగుతున్నాయి. జనరల్ ఫండ్స్ నుంచి రూ.69 లక్షల అంచనా వ్యయంతో 8 పనులు ప్రారంభమయ్యాయి. ఇందులో ప్రధానంగా 24వ వార్డులోని కార్వేటినగరం రోడ్డు నుంచి 16వ వార్డులోని డీఎస్పీ కార్యాలయం వరకు చేపట్టిన పనులు జోరుగా జరుగుతున్నాయి. సోమవారం ప్రారంభం కావడంతో కాపువీధి, బజారువీధుల్లో రాకపోకలను నిలిపివేశారు. అలాగే 5వ వార్డులోని చాటూరు, 8వ వార్డులోని తాటితోపు వీధిలో పనులు ప్రారంభించాల్సి ఉంది. రూ.22 లక్షలతో కాపువీధిలోని సీసీ డ్రైనేజీ నిర్మాణం పూర్తయింది.

పాఠం.. దృశ్యరూపం

- పాఠ్య పుస్తకాల్లో క్యూఆర్ కోడ్
- స్మార్ట్‌ఫోన్‌లో స్కాన్ చేస్తే విద్యార్థులు పాఠాన్ని చూస్తూ వినొచ్చు
- సాంకేతిక విద్యావిధానం అమలు చేస్తున్న రాష్ట్రప్రభుత్వం
- క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే సెకండ్లలో సందేహాలు నివృత్తి
- విద్యార్థులకు సులభతరంగా మారిన విద్యావిధానం



విద్యార్థులకు క్యూఆర్ కోడ్‌పై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయురాలు

రాష్ట్రప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తున్న విషయం విదితమే. నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వం స్కూళ్లు, కళాశాలల రూపురేఖలు మార్చింది. ఈ ఏడాది కొత్తగా విద్యార్థులకు అందించే పాఠ్యపుస్తకాల్లో క్యూఆర్ కోడ్‌ను పొందుపరిచింది. దీంతో విద్యార్థులు ఏదైనా కారణం చేత స్కూల్‌కు వెళ్లలేని రోజు ఇంటి వద్దే ఉండి మొబైల్‌లో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి పాఠాలను వీడియో రూపంలో వినే అవకాశం కల్పించింది. నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ నూతన విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది.

కార్వేటినగరం: విద్యార్థులకు సులభంగా పాఠాలు అర్థమయ్యేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకొచ్చింది. విద్యార్థులు పాఠ్యాంశాలను అర్థం చేసుకునేందుకు పుస్తకాలను వీడియో రూపంలో అందుబాటులోకి తీసుకొచ్చింది. కొంతమంది విద్యార్థులు విని నేర్చుకుంటే మరికొందరు దృశ్యరూపాలను చూసి నేర్చుకుంటారనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ విధానాన్ని ప్రవేశపెట్టింది. దృశ్యరూపంలో చూస్తే విద్యార్థులకు ఎప్పటికీ జ్ఞాపకం ఉంటుంది.



క్యూఆర్ కోడ్‌తో ముద్రించిన పాఠం

సాధారణంగా పాఠశాలలో ఉపాధ్యాయులు పాఠాలు బోధించేటప్పుడు విద్యార్థులకు ఎన్నో సందేహాలు వస్తాయి. వాటిని నివృత్తి చేసుకోవడానికి ఇబ్బంది పడేవారు. కానీ ఇప్పుడు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే చాలు. సందేహాలు నివృత్తి కావడంతో పాటు పాఠాలకు సంబంధించిన అదనపు సమాచారం కూడా వస్తుంది. ఈ సరికొత్త సాంకేతిక విద్యావిధానం అందుబాటులోకి రావడంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మేధో సంపత్తిని పెంపొందించడానికి..

ప్రతి విద్యార్థిలో మేధోసంపత్తి పెంపొందాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి పాఠ్యాంశానికి సంబంధించి పుస్తకంలో క్యూఆర్ కోడ్‌ను రూపొందించింది. గతంలో పాఠ్యపుస్తకంలో మొదటి, చివరిపేజీలో మాత్రమే క్యూఆర్ కోడ్ ఉండేది. అది పెద్దగా విద్యార్థులకు ఉపయోగ పడేది కాదు. ఇప్పుడు ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు అన్ని పాఠ్యపుస్తకాల్లో ప్రస్తుతం క్యూఆర్ కోడ్ కనిపిస్తోంది. ఈ కోడ్‌ను విద్యార్థులు స్మార్ట్‌ఫోన్లలో స్కాన్ చేసి పాఠ్యాంశాలను చూస్తూ, వింటూ అర్థం చేసుకోవచ్చు. స్కూళ్లలో ఇప్పటికే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకుని పాఠాలు వినే విధానంపై ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నారు.

స్కాన్ చేస్తే చాలు..

విద్యార్థులు ప్రభుత్వం అందించిన పుస్తకాల్లో క్యూఆర్ కోడ్‌ను స్మార్ట్‌ఫోన్ల ద్వారా స్కాన్ చేస్తే వీడియో రూపంలో పాఠం ప్రత్యక్ష అవుతుంది. పాఠం వింటూ, చూస్తూ నేర్చుకోవచ్చు. విద్యార్థులు వివిధ కారణాలతో పాఠశాలకు రాకపోతే కోల్పోయిన పాఠ్యాంశాలను ఈ విధానంలో విని నేర్చుకునే సౌలభ్యం కూడా ఉంది. సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు. ఒక్కసారి స్కాన్ చేసి డౌన్‌లోడ్ చేసుకుంటే ఆ పాఠ్యాంశం విద్యార్థుల ఫోన్ గ్యాలరీలో సేవ్ అవుతుంది. ఆఫ్‌లైన్‌లో చూసుకునే అవకాశం ఉంది.

చాలా ఉపయోగంగా ఉంది



పాఠ్యాంశాల్లో సందేహాలను నివృత్తి చేసుకునేందుకు క్యూఆర్ కోడ్ విధానం ఎంతో ఉపయోగంగా ఉంది. ఒక అంశానికి సంబంధించిన పూర్తి సమాచారం వీడియో రూపంలో ఉండడంతో పదేపదే చూసి నేర్చుకునే అవకాశం ఉంది. ఈ విధానం వల్ల పూర్తిస్థాయిలో పాఠ్యాంశాలపై అవగాహన కలుగుతుంది. ఎప్పుడైనా స్కూల్‌కు వెళ్లకపోతే ఆ రోజుకు సంబంధించిన పాఠ్యాంశాలను క్యూఆర్ కోడ్‌తో నేర్చుకునేందుకు అవకాశం ఉంది.
–భవితశ్రీ, 10వ తరగతి విద్యార్థిని, బాలికల ఉన్నత పాఠశాల

అవగాహన కల్పిస్తున్నాం



క్యూఆర్ కోడ్ విధానంలో పాఠాలు నేర్చుకునేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. పాఠ్యాంశాలు వీడియో రూపంలోఉండడం వల్ల త్వరగా అర్థమవుతాయి. అలాగే మెదడులో నిక్షిప్తమైన వీడియోలు పునఃశ్చరణ సమయంలో గుర్తుకువచ్చి విద్యార్థులకు ఉపయోగపడుతాయి. క్యూఆర్ కోడ్ పాఠ్యాంశాలపై ప్రతి తరగతిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం
–వేణుగోపాల్, ఉపాధ్యాయుడు, బాలికల హైస్కూల్, కార్వేటినగరం

విద్యావిధానంలో విప్లవాత్మకం



విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచి ఉన్నత ర్యాంకులు సాధించేందుకు రాష్ట్రప్రభుత్వం విద్యావిధానంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చింది. క్యూఆర్ కోడ్ ప్రతి పేజీకి ఉండడం వల్ల ఆయా పాఠ్యాంశానికి సంబంధించిన వీడియోలు అందుబాటులో ఉంటాయి. అందువల్ల వారి సందేహాలు సులభంగా నివృత్తి అవుతాయి. పాఠ్య పుస్తకాల్లో క్యూఆర్ కోడ్ తీసుకురావడం సంతోషం.
–విజయేంద్రరావు, జిల్లా విద్యాశాఖ అధికారి, చిత్తూరు

మెనూ ప్రకారం భోజనం అందించండి



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం తింటున్న ఎంఈఓ రాజేంద్రప్రసాద్

పాలసముద్రం: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం పెట్టాలని ఎంఈఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. సోమవారం వెంగళరాజుకుప్పం ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం పప్పు, కూరగాయలు, గుడ్లు ప్రతిరోజు సక్రమంగా పెట్టాలని తెలిపారు. అన్నం చేయకముందే బియ్యాన్ని మంచి నీటితో కడిగిన తరువాతే వండాలన్నారు. రసం, సాంబారుకు తాజా కూరగాయలు, అయోడిన్ ఉప్పు వాడాలని సూచించారు. హెచ్‌ఎంలు విద్యార్థుల హాజరును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. అనంతరం ఆయన విద్యార్థులతో కూర్చుని భోజనం చేశారు. హెచ్‌ఎం వెంకటేశ్ ఉన్నారు.

రాయితీపై చాప్ కట్టర్ల పంపిణీ



అర్హులకు రాయితీపై చాప్ కట్టర్‌లను పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

వెదురుకుప్పం: మండలకేంద్రంలో అర్హులైన 56 మంది పాడి రైతులకు 40 శాతం సబ్సిడీపై గడ్డిని కత్తిరించే యంత్రాలను అందజేశామని సహాయ సంచాలకులు డాక్టర్ రూపసుందరి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాప్ కట్టర్లను ఉపయోగించడం ద్వారా గడ్డి వృథాను తగ్గించి అధిక పోషకాలు ఉన్న మేతను పశువులకు అందించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సమన్వయకర్త బండి హేమసుందర్‌రెడ్డి, నాయకులు రామయ్య, గోవిందయ్య, శివాజీ, పెద్దిరెడ్డి, నరేష్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, భూపాలయ్య, పశువైద్యులు డాక్టర్ రాజేష్, నాగేంద్రరెడ్డి పాల్గొన్నారు.

అగ్నిహోత్రిగా ద్రౌపదీదేవి



అగ్నిహోత్రిగా ద్రౌపదీదేవి



అగ్నికుండలు పట్టుకుని మహాభారత పారాయణం చేస్తున్న భాగవతారిణి

నగరి: మున్సిపల్ పరిధిలోని చింతలపట్టెడలో ఏటా వైభవంగా నిర్వహించే ద్రౌపదీ తిరనాళ్లలో భాగంగా సోమవారం ద్రౌపదీదేవికి అగ్నిహోత్రి అలంకరణ చేశారు. అఖిలోభుడనే రాక్షసుని సంహరించడానికి ద్రౌపదీదేవి అగ్ని నుంచి అవతరించిందని ప్రతీతి. అగ్ని నుంచి ఉద్భవించినందుకు ప్రతీకగా ఆమెకు అగ్నిహోత్రి అలంకరణ చేపట్టారు. అమ్మవారి విగ్రహం చుట్టూ పెద్దఎత్తున దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా అమ్మవారి అలంకరణ భక్తులను అమితంగా ఆకట్టుకుంది. ఆలయం వద్ద నిర్వహించిన మహాభారత పారాయణంలో భాగవతారిణి అగ్ని కుండలను పట్టుకుని పారాయణం చేయడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ వేడుకలను చూడడానికి భక్తులు ఆలయం వద్ద అధిక సంఖ్యలో బారులు తీరారు. ఏర్పాట్లను ఉత్సవ నిర్వాహకులు నటరాజన్ పర్యవేక్షించారు.

వెంకటేష్ మృతి పార్టీకి తీరని లోటు





వెంకటేశ్ (ఫైల్)

నగరి: మండలంలోని అడవికొత్తూరు గ్రామానికి చెందిన వైస్ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేష్ (40) గుండెపోటుతో మరణించారు. విషయం తెలిసి పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంత్రి ఆర్కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి సోమవారం గ్రామానికి వెళ్లి వెంకటేశ్ మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు. అతని కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ వ్యవహారాలతో పాటు గ్రామంలో సమస్యల పరిష్కారానికి చొరవ చూపే వెంకటేశ్ ఆకస్మికంగా మృతిచెందడం పార్టీకి తీరని లోటని ఆయన తెలిపారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ప్రజావసరాలకు ప్రాధాన్యం

- పట్టణ అభివృద్ధికి మంత్రి ఆర్‌కే రోజా సహకారం అందిస్తున్నారు
- మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం





సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ నీలమేఘం, హాజరైన కౌన్సిలర్లు, అధికారులు

నగరి: ప్రజావసరాలు పూర్తి చేస్తూ మున్సిపాలిటీ నిర్వహణ ముందుకు సాగుతోందని అందుకు మంత్రి ఆర్‌కే రోజా పూర్తిస్థాయిలో సహకారం అందిస్తున్నారని మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం అన్నారు. సోమవారం నగరి మున్సిపల్ కార్యాలయంలో ఆయన సాధారణ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి సమావేశపు అజెండాను సభ్యులకు చదివి వినిపించారు. అజెండాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలన్నారు. కౌన్సిలర్ భారతి మాట్లాడుతూ కుశస్థలి నదిపై వంతెనను సరిచేయాలని కౌన్సిల్‌ను కోరారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ అది ఆర్‌అండ్‌బి పరిధిలోకి వస్తుందని, వారికి లేఖ ద్వారా సమస్యను తెలియజేస్తామన్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ మంత్రి ఆర్కేరోజా సహకారంతో మున్సిపల్ పరిధిలో అన్ని వార్డుల్లోను ప్రజావసరాలను పూర్తిచేస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. గడపగడపకు నిధుల ద్వారా వార్డుకు రూ.20 లక్షల చొప్పున నిధులను అభివృద్ధికి వెచ్చించడం జరుగుతోందన్నారు. నూతన మున్సిపల్ కార్యాలయం కూడా త్వరలో నిర్మించనున్నామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్లు వెంకటరత్నం, ఫ్లోర్ లీడర్ దయానిధి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, డీఈ నరేష్, మేనేజర్ శేఖర్, టీపీఓ నీరజాక్షి, సీడీపీఓ కృష్ణవేణి, మెప్మా అధికారి సునీత, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్ ఆమోదించిన అంశాలు..

సర్వే నంబరు 99/8లో ఎ0.84 సెంట్లలో సైట్ ఏరియా 3409.33 చదరపు మీటర్లలో 1323.76 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నూతనంగా నిర్మించనున్న మున్సిపల్ కార్యాలయానికి సంబంధించి బిల్డింగ్ ప్లాన్ తయారీ, ఆన్‌లైన్‌లో ప్లాన్ సమర్పణకు రూ.25 వేలు సాధారణ నిధుల నుంచి కేటాయింపు

- 21వ వార్డు భారతియార్ వీధిలో కల్వర్టు నిర్మాణం, పావడి వీధిలో రోడ్డు నిర్మాణానికి రూ.2.20 లక్షలు సాధారణ నిధుల నుంచి కేటాయింపు
- మున్సిపల్ పరిధిలోని 29 వార్డుల్లో మోటార్ల మరమ్మతులు, బావిలో పడిన మోటార్లు వెలికితీయుట, కొత్త మోటార్లకు రూ.5 లక్షలు సాధారణ నిధుల నుంచి కేటాయింపు
- దహన క్రియల షెడ్డు నిర్మాణానికి అడ్వాన్సుగా రూ.5 లక్షలు సాధారణ నిధుల నుంచి మంజూరు
- హ్యాండ్‌లూమ్ కోఆపరేటివ్ సొసైటీ వారికి ఆప్కో అమ్మకాల కోసం సంతమైదానంలోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో రెండు గదులు కేటాయింపు

అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యం



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

- ప్రతి గడపలో ప్రజలు ఆనందంగా ఉన్నారు
- వచ్చే ఎన్నికల్లో మరోమారు వైఎస్సార్‌సీపీకి అవకాశం ఇవ్వండి
- మంత్రి ఆర్‌కే రోజా

నగరి: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అన్ని వర్గాలు అభివృద్ధి చెందాయని, ప్రతి గడపలోనూ సంతోషం వెల్లివిరుస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని 2వ వార్డు ఎంకేకే క్రండిగ, కాకవేడు, కాకవేడు ఎస్టీకాలనీ, ఆదిఆంధ్రవాడ ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆమె పర్యటించారు. మండల స్థాయి అధికారులతో కలసి గడప గడపకు వెళ్లి వారికి గత నాలుగేళ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరిస్తూ సంక్షేమ బుక్‌లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పాలనపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పాలన కొనసాగుతోందన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా లబ్ధిదారుల చెంతకే సంక్షేమం వెళ్తోందన్నారు. అభివృద్ధికి అవసరమైన విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ పాలన కొనసాగుతోందన్నారు. గత ప్రభుత్వ పాలనకు ప్రస్తుత పాలనకు మధ్య వ్యత్యాసాన్ని చూడాలని ఆమె కోరారు. చంద్రబాబు నాయుడు గత ఎన్నికల్లో ఇచ్చిన 600 హామీలను మాఫీ చేసి ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు వెన్నుపోటు పొడిచారన్నారు. మరోసారి మభ్యపెట్టడానికి నేడు ప్రజల ముందుకు వస్తున్నారన్నారు. మంచికి ప్రజలు అండగా నిలవాలన్నారు. ప్రతి ప్రాంతంలో మంత్రి రోజాకు స్థానికులు గజమాలలు వేసి, దుశ్శాలువలతోను సత్కరించి హారతులు పట్టి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్ చైర్మన్ వెంకటరత్నం రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, సీడీపీఓ కృష్ణవేణి, మెప్మా టీఎల్‌ఎం సునీత, కౌన్సిలర్లు ఇంద్రయ్య, మురుగ, కోఆప్షన్ సభ్యులు హమీద్, నాయకులు మునివేలు, రాజముత్తు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లీశ్వరుడికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో కొండమల్లీశ్వర స్వామి

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎన్ కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యం సమర్పించారు. అనంతరం కొండమల్లీశ్వరుడికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారికి సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. ఆలయ ఆవరణలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పాడి అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



రైతులకు చాప్ కట్టర్‌పై అవగాహన కల్పిస్తున్న పశుసంవర్థక శాఖ అధికారులు

గంగాధరనెల్లూరు: పాడి రైతుల అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పశు సంవర్థక శాఖ జిల్లా ఉప సంచాలకులు డాక్టర్ ఆరీఫ్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలో రైతులకు ప్రభుత్వం రాయితీపై అందించిన చాప్ కట్టర్ల యంత్రాలను ఎంపీపీ అనిత ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అర్హులైన 57 మందికి రూ.33 లక్షల విలువ చేసే చాప్ కట్టర్లను అందించడం జరిగిందన్నారు. ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకుని రైతులు పాడి పెంపకాన్ని విస్తరింపచేయాలని సూచించారు. అనంతరం ఎంపీపీ అనిత మాట్లాడుతూ పాడి రైతులకు ప్రభుత్వం గడ్డి విత్తనాలు కూడా 70 శాతం రాయితీపై అందిస్తోందని తెలిపారు. అదేవిధంగా టీఎంఆర్ దాణామృతం 60 శాతం సబ్సిడీ పంపిణీ చేయడం జరుగుతుందని గుర్తు చేశారు. అధిక పోషణ విలువలు కలిగిన అమృత దాణామృతం అధిక పాల దిగుబడికి తోడ్పాటు అందిస్తుందన్నారు. రాష్ట్రప్రభుత్వం పాడి రైతుల అభివృద్ధికి కీలక నిర్ణయం తీసుకుని లీటర్ పాల ధర రూ.35 నుంచి రూ.40 వరకు పెంచిందన్నారు. అనంతరం చాప్ కట్టర్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్రమణ్యం, ఎంపీటీసీ రామచంద్రారెడ్డి, పశు సంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మురళీమోహన్, పశు వైద్యాధికారి డాక్టర్ నాగాంజనేయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు మునిరాజారెడ్డి పలువురు పాల్గొన్నారు.

ఏఆర్ కానిస్టేబుల్‌కు మ్యాన్ ఆఫ్ ద సిరీస్



మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచిన ఏఆర్ కానిస్టేబుల్ గణపతి

గంగాధరనెల్లూరు: రాష్ట్రప్రభుత్వం చిత్తూరులో ఆధ్వర్యంలో 30 రోజుల పాటు నిర్వహించిన పీఎల్ఆర్, వీఎన్ఆర్ క్రికెట్ టోర్నమెంట్‌లో గంగాధరనెల్లూరు మండలం ఎట్టేరి గ్రామానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ గణపతి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచి రూ.50 వేలు నగదును అందుకున్నారు. ఈ సందర్భంగా గంగాధరనెల్లూరు ఎస్ఐ రామాంజనేయులు అభినందించారు. అనంతరం పోలీస్ సిబ్బంది ఆయనకు శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఒత్తిళ్లకు లోనవుతున్న సిబ్బందికి క్రీడల్లో మానసిక ఉల్లాసం లభిస్తోందని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం క్రీడలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అదే ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి చేతుల మీదుగా నగదు బహుమతి అందుకోవడం సంతోషంగా ఉందన్నారు.

జయరాజ్ శేఖర్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందుకున్న జయరాజ్ శేఖర్

కార్వేటినగరం: మండల పరిధిలోని కత్తెరపల్లి ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న జయరాజ్ శేఖర్‌కు డాక్టరేట్ అవార్డు వచ్చిందని డీసీఈబీ కార్యదర్శి కె.హేమారెడ్డి తెలిపారు. సోమవారం పాఠశాల ఆవరణలో అవార్డు గ్రహీత జయరాజ్ శేఖర్‌ను ఉపాధ్యాయ బృందం శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హేమారెడ్డి మాట్లాడుతూ గత ఆరేళ్లుగా జయరాజ్ శేఖర్ సామాజిక సేవలు అందించారని, అదేవిధంగా కరోనా సమయంలో సామాజిక అవగాహన కల్పించడంతో పాటు, రక్తదానం, నిత్యావసర సరుకులు అందించారని తెలిపారు. అందువల్ల జయరాజ్ శేఖర్‌ను ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ అకాడమీ వారు గుర్తించి తమిళనాడులోని హోసూరులో ఏర్పాటు కార్యక్రమంలో గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయడం జరిగిందన్నారు. సామాజిక సేవలు అందించే ఉపాధ్యాయుడు తమ పాఠశాలలో ఉండడం ఎంతో గర్వంగా ఉందని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

వైభవంగా మహాకుంభాభిషేకం



నాగాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

గంగాధరనెల్లూరు: మండల పరిధిలోని కడపగుంట గ్రామ సమీపంలో వెలసిన నాగాలయ్మ ఆలయంలో సోమవారం ఆలయ జీర్ణోద్ధరణ, కుంభాభిషేకం కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు వేద మంత్రాలతో ప్రత్యేక హోమాలు చేశారు. అదేవిధంగా మూడోరోజు ఆలయంలో మహా కుంభాభిషేకం నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాత చక్రవర్తి, రోజా దంపతులు ఆలయ కుంభాభిషేకాన్ని వైభవంగా జరిపించారు. అనంతరం అమ్మవారి మూల విరాట్‌ను పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ మహా కుంభాభిషేకాన్ని తిలకించడానికి పలు గ్రామాల నుంచి అశేష భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.